మహిళలకు రూ. 1,500 ఇవ్వాల్సిందే



మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ప్రచారంలో హోరెత్తించారు. తీరా అందలం ఎక్కాక ఆ ఊసే లేకుండా పోయింది. హామీలు ఇచ్చాక మరచిపోతే ఎలా. నాతో పాటు మహిళలందరూ రూ. 1,500 ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తున్నారు. త్వరగా ఇచ్చి ఆదుకోవాలి.

- రమణమ్మ, మేకవారిపల్లె, బి.కోడూరు మండలం

మూడు సిలిండర్లు ఏమయ్యాయి



ప్రతి ఇంటికి కచ్చితంగా ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కూటమి నేతలతో పాటు స్థానిక అభ్యర్థులు కూడా ఈ అంశంపై ప్రచారం చేశారు. ఇప్పుడేమో మరచిపోయారు. పేదలందరూ ఎప్పుడు గ్యాస్ సిలిండర్లు ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు.

- కానాల విజయ, ఏకోపల్లె గ్రామం, దువ్వూరు మండలం

పంటల సాగుకు పెట్టుబడి ఇవ్వరా?



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇస్తామని చెప్పింది. నెలలు గడుస్తున్నా ఇంత వరకు రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ సాయం జమ కాలేదు. ఇప్పటికైనా పెట్టుబడి సాయాన్ని జమ చేయాలి.

- నీలం వెంకటరామిరెడ్డి, రైతు, ఓబులాపురం, మైదుకూరు

తల్లికి వందనం ఎప్పుడు?



మాది పేద కుటుంబం. మాకు ఇద్దరు పిల్లలు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గతంలో జగనన్న ఏటా ఒకరికి అమ్మఒడి కింద నగదు ఖాతాలో జమ చేసేవారు. చంద్రబాబు ఎన్నికల హామీలో భాగంగా ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలి.

- డి.పద్మావతి, ఆకులనారాయణపల్లె ఎస్టీ కాలనీ, కాశినాయన మండలం

నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వాలి



నేను బి.కాం కంప్యూటర్ సైన్స్ చేశాను. ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాను. గతంలో కూడా చంద్రబాబు నిరుద్యోగ భృతి పథకం ద్వారా రూ.2 వేలు ఇస్తామని చెప్పారు. చివరకు ఎన్నికల దగ్గర పడుతున్నప్పుడు అమలు చేశారు. ఈ సారి అధికారంలోకి వచ్చి రెండు నెలలవుతోంది. ఇప్పటికైనా నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇచ్చి నిరుద్యోగులందరికీ భృతి కల్పించాలి.

- బి.రాజశేఖర్‌బాబు, నిరుద్యోగి, కొట్టాలపల్లె, కాశినాయన మండలం


ఉచిత బస్సు ఏమైందో



టీడీపీ కూటమి ఎన్నికల సందర్భంగా మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పింది. ఇప్పటికీ దానిపై ప్రస్తావనే లేదు. అధికారంలోకి వచ్చాక హామీలన్నీ గాలికి వదిలేశారు. **- ప్రమీల, మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు, ప్రొద్దుటూరు**

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



'అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరూ.. వాడా ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సహాయం అన్నదాతా సుఖీభవ పథకం కింద అందజేస్తాం.. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ. 15 వేలు తల్లికి వందనం పేరిట ఇస్తాం... ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం.. నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తాం.. ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఖాతాలకు జమచేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని.. ఇలా తమ మేనిఫెస్టోలో చేర్చి భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. ఖరీఫ్ వ్యవసాయం ప్రారంభమైంది. రైతాంగం పంటల సాగు పనుల్లో ఉన్నారు. అయినా వారికి సాయం ఇవ్వలేదు. ఇలా చెప్పిన ప్రతి పథకం ఇంత వరకూ అతీ గతీ లేదు. గత ఐదేళ్లలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పథకాలన్నీ పక్కాగా అమలు చేసింది. దీంతో ప్రజలు గత ప్రభుత్వం ఇచ్చినట్లుగానే కచ్చితంగా హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఎన్నో హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చడంలో వెనకడుగు వేస్తున్నారు. నిధులు లేవనే సాకు చూపుతున్నారు. సంపద సృష్టించి ఇస్తామని చెప్పిన వారు.. ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదు. **-ప్రవీణ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు, కేవీపీఎస్, కలసపాడు**

ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నారు



నాకు ఇద్దరు పిల్లలు. ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నాం. ఫీజుల కోసం యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. కానీ ఇంత వరకు ఇవ్వలేదు.

- పి.జయమ్మ, గౌరీశంకర్‌నగర్, బద్వేలు



ప్రతి మహిళకు నెలకు రూ.1500

నియోజకవర్గం	అర్హులు	నిధులు రోజుకు (రూ. కోట్లలో)
బద్వేలు	88,120	13.22
ప్రొద్దుటూరు	97,933	14.68
మైదుకూరు	80,824	12.13



నిరుద్యోగ భృతి

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
బద్వేలు	10,305	3.09
ప్రొద్దుటూరు	35,563	10.66
మైదుకూరు	23,040	6.91



టీడీపీ ఒక్కో ఏడాదికి అన్నదాతా సుఖీభవకు కేటాయించాల్సింది

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
బద్వేలు	35,400	70.80
ప్రొద్దుటూరు	20,763	41.52
మైదుకూరు	35,622	71.25



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి వందనం అందాల్సిన సాయం

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
బద్వేలు	27,763	41.64
ప్రొద్దుటూరు	1,14,321	167.14
మైదుకూరు	35,622	53.43



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

నియోజకవర్గం	అర్హులు
బద్వేలు	1,10,122
ప్రొద్దుటూరు	1,46,210
మైదుకూరు	1,59,274



ప్రతి ఇంటికి 3 గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
బద్వేలు	85,650	21.91
ప్రొద్దుటూరు	70,853	18.13
మైదుకూరు	76,801	19.65

ఉద్యోగాలు భర్తీ చేయాలి



పలు ప్రభుత్వ శాఖల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎంతో మంది నిరుద్యోగులు నమ్మి ఓట్లు వేశారు. కూటమి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మాత్రం నోటిఫికేషన్ ఇచ్చింది. మిగతా పోస్టుల భర్తీపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ శాఖల్లోని అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.

- డేవిడ్ రాజు, నిరుద్యోగి, ప్రొద్దుటూరు

రైతు భరోసా ఇవ్వాలి



రైతుకు ప్రతి ఏడాది సాయం కింద రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండెండు నెలలైంది. ఇప్పటికీ రైతుకు సాయం అందించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెప్పిన మాట ప్రకారం ప్రతి ఏడాది ఖరీఫ్ ప్రారంభంలోనే అందించారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్చింది. కానీ డబ్బులు ఇవ్వక పోవడంతో రైతులు పంటలు ఎలా సాగు చేయాలోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులకు వెంటనే రూ.20 వేలను ఇవ్వాలి.

- నారాయణ రెడ్డి, రైతు, వెలవలి గ్రామం, రాజుపాళెం మండలం

రైతు భరోసా

ఒక్కో ఏడాదికి అందిన సాయం



నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
బద్వేలు	35,400	47.79
ప్రొద్దుటూరు	20,763	28.03
మైదుకూరు	35,622	48.08

అమ్మ ఒడి

ఒక్కో ఏడాదికి అందిన సాయం



నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
బద్వేలు	41,270	61.90
ప్రొద్దుటూరు	22,778	34.16
మైదుకూరు	31,130	46.66



బద్వేలు నియోజకవర్గంలో సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రోశయ్య, టీడీపీ నాయకుడు రితేష్‌రెడ్డి (ఫైల్)

క్రీడలతో మానసికోల్లాసం

కలసపాడు : క్రీడలతో మానసికోల్లా సంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సీమాలిని తెలిపారు. బుధవారం స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ మండల స్థాయిలో అన్ని పాఠశాలలకు జరిపించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ సుమన్ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రామాపురం, శంఖవరం, బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ, సెయింట్ ఆంటోనీస్, ఎస్‌అండ్‌జే, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, రవికుమార్, రవిచంద్రుడు పాల్గొన్నారు.

యువతకు కౌన్సెలింగ్

బ్రహ్మంగారిమఠం : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో బుధవారం సాయంత్రం జిల్లా నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ సీఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో కక్కయ్యమఠం, పోలేరమ్మగుడి సమీపం, కాశినాయణగుడి సమీపం తదితర ప్రాంతాలలో ఉన్న యువకులను తనిఖీ చేసి కౌన్సిలింగ్ ఇచ్చారు. స్పెషల్‌పార్టీ ఎస్ఐ మురళీ, స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్, పోలీసులు పాల్గొని గంజాయి మత్తుకు యువకులు బానిసలైతే ప్రాణాలు కోల్పోతారు అని తెలిపారు.

పేద విద్యార్థులకు న్యాయం చేయాలి

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ సీట్ల విషయంలో పునరాలోచించి, పేదల విద్యార్థులకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని పేర్కొన్నారు. బుధవారం డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ సీట్లు కేటాయిస్తే సీట్లు వద్దని కేంద్రానికి లేఖ రాయడం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్‌షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షుడు ఫాతిమా, యువరాజ్, ఖలీల్, మాపీరా, కోశాధికారి నాగలక్ష్మి పాల్గొన్నారు.

త్వరలో వెంచర్లపై సర్వే

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలో ఉన్న సాయికృప ఎన్‌క్లేవ్ వెంచర్‌లో త్వరలో సర్వే చేపట్టనున్నారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీలో ఉన్న సాయిశ్రీనగర్ -1, 2, సాయికృప కాలనీ -1, 2, సాయికృప ఎన్‌క్లేవ్, సాయి ద్వారకానగర్, సాయిశ్రీదత్త నగర్ వెంచర్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఇందులో ప్రభుత్వ బంజరు భూమి కూడా ఉందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మొత్తం 206.39 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్లను నిర్మించారు. ఇటీవల కలెక్టర్ ఆర్డీఓ, తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ లేఅవుట్లకు సంబంధించి ల్యాండ్ కన్వర్షన్ జరిగిందా లేదా, ప్రభుత్వ భూములు ఇందులో కలిశాయా అన్న అంశంపై విచారణ చేపట్టాలని కలెక్టర్ తహసీల్దార్‌కు సూచించారు. అప్పటి వరకు ఈ వెంచర్లలో అమ్మకాలు, కొనుగోలు జరగకుండా చూడాలని, ఇందుకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింహులు లే అవుట్లలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ వి.గంగయ్య మాట్లాడుతూ రామేశ్వరం రిజర్వ్ ఫారెస్టుకు సంబంధించిన సర్వేపూర్తయిన తర్వాత సాయికృప వెంచర్లతోపాటు మిగతా వెంచర్లను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు.



కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని లే అవుట్‌లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అటవీ భూముల నిజనిర్ధారణకు సర్వే

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల పరిధిలోని రామేశ్వరం రిజర్వ్ ఫారెస్టుకు సంబంధించి భూముల నిర్ధారణ కోసం బుధవారం నుంచి సర్వే ప్రారంభించారు. అటవీ, రెవెన్యూ, గ్రామ పంచాయతీ, ఏపీఐఐసీ అధికారులతో కలపి మొత్తం 30 మందితో ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. రిజర్వ్ ఫారెస్టుకు సంబంధించిన భూములు చాలా వరకు ఆక్రమణకు గురయ్యాయి. సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కువ మంది నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు స్థలాలను అమ్మడం, కొనడం జరుగుతోంది. ఈ అంశంపై అటవీశాఖ అధికారులు ఇటీవల జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ వి.గంగయ్య ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. వారం రోజులపాటు సర్వే చేసి అటవీభూముల హద్దులను నిర్ధారిస్తామని తహసీల్దార్ తెలిపారు. జమ్మలమడుగు డివిజన్ సర్వేయర్లు గురివిరెడ్డి, హరి ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతోంది.

గురుకుల పాఠశాలలో కంటి వైద్య శిబిరం

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కాలేజీలో స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 560 మంది విద్యార్థినులను పరీక్షించగా, వారిలో 71 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించినట్లు నేత్ర వైద్యాధికారి రఘురామిరెడ్డి తెలిపారు. వారికి ప్రభుత్వం ద్వారా అద్దాలను ఉచితంగా ఇస్తామని చెప్పారు. మండలంలోని అన్ని అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, హైస్కూల్ విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉండాలని సూచించారు.

సంక్షిప్తం

20, 21న క్రీడా పోటీలు

రాజుపాళెం : ఈనెల 20, 21 తేదీల్లో రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల ఎంపికలను నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల పీడీ ఎంసీ సుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని క్రీడాకారులు అండర్-14, 17 బాలబాలికలు పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షెటిల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు వచ్చేవారంతా పాఠశాల స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.

భక్తులకు అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని నందిని క్లాత్‌మార్కెట్ సమీపంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీ పాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో 500 మందిపైగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. ప్రతి నెలా పౌర్ణమినాడు భక్తులకు అన్నప్రసాద పంపిణీ ఉంటుందని భక్తులు పాల్గొనాలని శ్రీపాదవల్లభ దత్తాత్రేయస్వామి సేవా సంఘం వారు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు జయచంద్ర, రాము, గుప్త, బాలు, సుధాకర్, గంగాధర్, శివ పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన ర్యాలీ

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి పట్టణం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. స్వచ్ఛభారత్ విజయవంతం చేయాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు సులోచన, హరిబాబు, కల్యాణ్‌కుమార్, నగేష్, మల్లికార్జున, నరసింహారెడ్డి, పర్వీన్, సబిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం హెచ్ఐవీ/ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం సభ్యులు విద్యార్థులకు హెచ్ఐవీ/ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. 'మీకు తెలుసా' కార్యక్రమంలో ఖాదర్‌బాషా మాట్లాడుతూ ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రజల్లో అవగాహన పెంపొందిండంతోనే ఎయిడ్స్ వ్యాధుల తీవ్రత తగ్గిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామిరెడ్డి, అధ్యాపకులు చంద్రశేఖర్, శ్రీనివాసులు, అల్లాబకష్, బాలరాజు, రంతుబాష పాల్గొన్నారు.

ఈకేవైసీ లక్ష్యాలు పూర్తి చేయాలి

బద్వేలు అర్బన్ : ఇ-క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాన్ని, మార్కెట్‌యార్డు ఆవరణలోని అగ్రిల్యాబ్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ-క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ పూర్తయిన పంటలకే పంటల బీమా వర్తిస్తుందని, ఈ నేపథ్యంలో రైతులందరూ తాము సాగు చేసిన పంటలకు ఇ-క్రాప్, ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం బయనపల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ కషాయాల దుకాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్, వ్యవసాయాధికారులు చంద్రమోహన్‌రెడ్డి, రామకృష్ణయ్య, మాధురి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలో అవసరమైన మేర నీరు విడుదల చేసి నీటి వృథా చేయకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నీటి సరఫరా సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి సరఫరాలో ఎక్కడైనా సమస్య ఏర్పడితే తక్షణమే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీరు మహేష్, నీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

ఖాజీపేట : అక్రమ మద్యం అమ్మకాలు ఎవ్వరు చేసినా కఠిన చర్యలు తప్పవని దుకాణాదారులను ఖాజీపేట సీఐ మోహన్ హెచ్చరించారు. దుంపలగట్టు టోల్‌ప్లాజా వద్ద దుకాణాల్లో అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సీఐ తన సిబ్బందితో వెళ్లి దుకాణాలను పరిశీలించారు. అనంతరం దుకాణాదారులతో ప్రత్యేక సమావేశమై పలు సూచనలు చేశారు.

గ్రామాలలో పరిశుభ్రత పనులు

చాపాడు : మండల వ్యాప్తంగా గ్రామాలలో బుధవారం గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత పనులు చేపట్టారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామాలలో పరిసరాలు పరిశుభ్రంగా చేసే పనులు చేపట్టారు. అక్టోబరు 2వ తేదీ వరకు గ్రామాలలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించటం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

అనారోగ్యంతో సీనియర్ పాత్రికేయుడు మృతి

ఖాజీపేట : గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ పాత్రికేయుడు బొంగు శ్రీనివాసులు బుధవారం తుది శ్వాస విడిచారు. సుమారు 15 సంవత్సరాలు వివిధ పత్రికల్లో ఈయన పని చేశారు. గత కొంత కాలంగా కిడ్నీ తదితర సమస్యలతో బాధపడుతుండేవారు. అగ్రహారంలోని స్వస్థలంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు వారి కుమారులు తెలిపారు.

విద్యార్థులకు అర్థవంతమైన విద్యనందించాలి

చాపాడు : ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థవంతమైన విద్య అందించాలని డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను బుధవారం డిప్యూటీ డీఈఓ పరిశీలించారు. అనంతరం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌ను ఆయన తనిఖీ చేశారు.